31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

గురువారం 27 నవంబర్ 2025 పేజీలు : 8

## ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందించాలి

- జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 26 :** ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా భారత రాజ్యాంగానికి ప్రపంచ దేశాలతో ఎంతో గుర్తింపు ఉందని,అందరు రాజ్యాంగ స్ఫూర్తితో పని చేస్తూ ప్రజలకు మరింత సమర్ధవంతమైన సేవలందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. భారత రాజ్యాంగం ఆమోదించి 76 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మన దేశ ప్రజాస్వామ్యానికి మూలాధారం అని న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే మౌలిక సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రజలందరికి ప్రాధమిక హక్కులను కల్పించడంతో పాటు ప్రజల ప్రయోజనాలు లక్ష్యంగా చట్టాలను సైతం

2లో

## గ్రామ పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 75 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు
- మొదటి విడుతలో 7 మండలాలు, 122 గ్రామ పంచాయతీలు
- రెండవ విడుతలో 7మండలాలు, 144 గ్రామ పంచాయతీలు
- మూడవ విడుతలో 6,మండలాలు, 119 గ్రామ పంచాయతీలు
- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 26 :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణను పూర్తి శాంతియుత వాతావరణంలో నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, స్థానిక అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా నోడల్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 విడుతలలో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మంగళవారం సాయంత్రం ప్రెస్ రిలీజ్ చేసిందని, డిసెంబర్ 11న మొదటి విడత, డిసెంబర్ 14న రెండవ విడత, డిసెంబర్ 17న మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామ పంచాయతీలలో పొలిటికల్ పార్టీలకు సంబంధించిన ఫోటోలను, పోస్టర్లను వెంటనే తీసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడుతలో కోరుట్ల నియోజకవర్గంలోని 4 మండలాలు ఇబ్రహీంపట్నం, ముల్లాపూర్, కోరుట్ల, మెట్ పల్లి, వేములవాడ నియోజకవర్గంలోని 3 మండలాలు మేడిపల్లి, కథలాపూర్, భీమారం ఫేజ్-1 లో మొత్తం 122 గ్రామాలలోని 1172 వార్డులకు డిసెంబర్ 11న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, రెండవ విడుతలో జగిత్యాల నియోజకవర్గంలోని 5 జగిత్యాల, జగిత్యాల రూరల్, రాయికల్, సారంగాపూర్, బీర్పూర్, చొప్పదండి నియోజకవర్గంలో 2 మండలాలు మల్యాల, కొడిమ్యాల ఫేజ్-2 లో 144 గ్రాములలోని 1276 వార్డులకు డిసెంబర్ 14 న ఎన్నికల నిర్వహణ, మూడవ విడుతలో ధర్మపురి నియోజకవర్గంలోని 6 మండలాలు ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి, వెల్లటూర్, గొల్లపల్లి, పెగడపల్లి లకు






సంబంధించి ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫేజ్-3 లో 119 గ్రామంలోని 1088 వార్డులకు డిసెంబర్ 17 ఎన్నికల నిర్వహణ. 3 నుండి 4 గ్రామ పంచాయతీలకు కలిపి క్లస్టర్ల వారీగా ఒక ఆర్వో, ఏఆర్వోలను నియమించామని, ఇందుకు సంబంధించి ఆర్వోలకు, ఏఆర్వోలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. 75 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లను నియమించి సిసి టీని పర్యవేక్షణలో ఎన్నికల నిర్వహణ సజావుగా సాగే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 6,07,263 ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 2,89,702 కాగా, మహిళలు 3,17,552 కాగా ఇతరులు మంది ఉన్నారని కలెక్టర్ వివరించారు. మొదటి విడుతలో నవంబర్ 27 నుంచి నవంబర్ 29 వరకు మూడు రోజుల పాటు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి మండలానికి ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, ఒక ఏ.ఈ.ఓ (సహాయ వ్యయ వివరాల నమోదు అధికారి), ప్రతి జిల్లాకు ఒక స్టాటిక్ సర్వేలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేస్తామని చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తప్పనిసరిగా జరిగేలా పర్యవేక్షిస్తారని అన్నారు. ప్రతి జిల్లాలో ఎం.సి.ఎం.సి కమిటి, జిల్లా మీడియా సెల్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో వినియోగించే ఎలక్ట్రానిక్ వీడియోలకు ముందుగా ఎం. సి.ఎం.సి అనుమతి ఉండాలన్నారు. ఎన్నికల దృష్ట్యా తనిఖీలు నిర్వహించే

2లో

## పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలు
- నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు
- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమిషనర్




**చురకలు ప్రతినిధి కరీంనగర్, నవంబర్ 26 :** పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని జిల్లా కలెక్టర్లు,ఎస్పీలు, సీపీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,పోలీస్ కమిషనర్గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికలను మూడు విడుతలలో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని, డిసెంబర్ 11న మొదటి విడత, డిసెంబర్ 14న రెండవ విడత,డిసెంబర్ 17న మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల సంబంధించి గ్రామానికి అప్ డేట్ చేసిన రిజర్వేషన్లు,ఏ విడత పోలింగ్ ఉంటుంది, పోలింగ్ కేంద్రాల జియో

2లో

## నూతనోత్సాహాన్ని నింపిన అల్ఫోర్స్ స్పోర్ట్స్ మస్త్



**చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 26 :** క్రీడల ద్వారా విద్యార్థులకు వినోదంతో పాటు ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుందని తద్వారా వారు విజయాలను చాలా సులువుగా సాధిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి వావిలాల పల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో మరియు భగత్ నగర్ లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి అల్ఫోర్స్ స్పోర్ట్స్ మస్త్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు తప్పనిసరి అని మరియు వారికి వివిధ క్రీడల గురించి సమగ్రంగా తెలియ పరచవలసిన అవసరం ఎంతగానో ఉందని దీని ద్వారా విద్యార్థులు వారికి ఇష్టమైన క్రీడా రంగాన్ని ఎంపిక చేసుకొని అందులో నైపుణ్యం సాధించే విధంగా ప్రోత్సాహాన్ని అందించాలని వారు సూచించారు. తల్లి తల్లిదండ్రులు కూడా వారి పిల్లలకు ఇష్టమైనటువంటి క్రీడా రంగాలలో శిక్షణ ఇప్పించాలని మరియు విజయం సాధించే విధంగా ప్రేరేపించాలని చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో పాఠ్యాంశ ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను వివిధ సందర్భాలలో నిర్వహించడం జరుగుతుందని మరియు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులకు ఖో-ఖో,కబడ్డి, హ్యాండ్బాల్, ఫుట్బాల్, బాస్కెట్బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర పోటీలను నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవానికి ముందు వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగించి విద్యార్థులతో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తామని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, వ్యాయమ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వృద్ధులకు జెరియాట్రిక్ వైద్య సేవలు



**చురకలు విలేకరి, జగిత్యాల,నవంబర్ 26 :** జగిత్యాల జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (పాత బస్టాండ్)లో శుక్రవారం నవంబర్ 28వ తేదిన ఉదయం 9గంటల నుండి ప్రత్యేక జెరియాట్రిక్ ఉచిత వైద్య సేవలు, కన్సల్టేషన్ కార్యక్రమాలను జిల్లాలోని వయో దికులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ కోరారు.బుధవారం సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీనియర్ సిటిజెన్లు డయాబెటిస్, రక్తపోటు, గుండె, మూత్రపిండాలు,శ్వాసకోశ సమస్యలు, పక్షవాతం, మరియు మధుమేహం వంటి వృద్ధాప్య సంబంధిత వ్యాధులకు ఉచిత చికిత్స పొందవచ్చుని,అలాగే,ఫిజియోథెరపీ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని హరి అశోక్ కుమార్ వివరించారు.

## భర్తను కడతేర్చిన భార్య



**చురకలు విలేకరి, మల్లాపూర్, నవంబర్ 26 :** కట్టుకున్న భర్తను భార్యే హతమార్చిన సంఘటన మల్లాపూర్ మండలలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన పల్లికొండ మల్లయ్యను (52) అయన భార్య కత్తితో కోసి అత్యంత దారుణంగా హతమార్చారు.సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కాగా భర్తను సొంత భార్యే హత్య చేయడంపై పూర్తీ వివరాలను పోలీసులు తెలజేయాల్సి ఉంది.

## పల్లెపల్లెకు తిరగండి..

## కాంగ్రెస్ మద్దతు దారులను గెలిపించండి

**-కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,**

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**-మేడిపల్లి సత్యంను సన్మానించిన కాంగ్రెస్ నేత ప్రణవ్**



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, నవంబర్ 26 :** హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, ఆరు గ్యారెంటీలను, ప్రభుత్వ, సి ఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న కార్యక్రమాలను బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, పల్లె పల్లెకు గడపగడపకు వెళ్లాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియామకమైన చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం అన్నారు. హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్బంగా సత్యం ను అభినందించి సన్మానించారు. హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని దాన్ని మరింత జనంలోకి తీసుకెళ్లాలని, స్థానిక ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని, అవసరమైతే తాను నియోజకవర్గంలో పర్యటిస్తానని, పార్టీ శ్రేణులను అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందించాలి

**మొదటి పేజీ తరువాయి...**పొందుపరిచారన్నారు.ప్రజల రక్షణ,శాంతి భద్రతలపరిరక్షణ లక్ష్యంగా ఏర్పడిన పోలీస్ వ్యవస్థలో ఉన్న మనమంతా రాజ్యాంగస్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు.రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్,వేణు,సైదులు,ఆర్ఎస్ఐలు,డిపిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ పెద్ద కుర్చీ కోసం.. ఆశావహుల గుద్దులాట

**-గ్రామాలలో మొదలైన సర్పంచ్ ఎన్నికల సందడి**

**-రాజకీయ సమరోత్సాహంలో ఆశావహుల ఆరాటం**




**చురకలు విలేఖరి, పెగడపల్లి నవంబర్ 26 :** తెలంగాణలో సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఇదొక సాధారణ ప్రకటన కాదు. గ్రామీణ ప్రజాస్వామ్యం మరోసారి తానెంత బలంగా నిలుస్తుందో నిరూపించుకునే పెద్ద పరీక్ష.పల్లెల్లో, పంచాయతీల్లో,పొలాల అంచుల్లో గత కొన్నేళ్ల లో ప్రజలు చూసిన అభివృద్ధి ఏమిటి? ఇంకా చేరనిది ఏమిటి? ఎవరికి ఓటు వేయాలి? అనే ఆలోచనలతో గ్రామాలు మళ్లీ చురుగ్గా మారాయి.

**నాయకులు కాదు..సేవకులు కావాలి**

సర్పంచ్ అంటే పదవి కాదు, బాధ్యత. ఆ బాధ్యతను ఎవరు నిజంగా భుజాన వేసుకోగలరో ప్రజలు పరిశీలించాల్సిన సమయం ఇది. నాయకుడి వాగ్దానాల కంటే, అతని పని గతం ముఖ్యం.ఎవరు నిజంగా పల్లె సమస్యలు అర్థం చేసుకున్నారు? ఎవరు రైతు సమస్యలపై నిలబడ్డారు? ఎవరు పంచాయతీ నిధులను పారదర్శకంగా వినియోగించగలరు?ఓటు వేసే చేతులు ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతున్నాయి.

**ప్రజల్లో పెరుగుతున్న అవగాహన**

ఈసారి గ్రామాల్లో ఒక మంచి మార్పు కనిపిస్తోంది. చాయ్ హొటల్ చర్చల్లో, సభల్లో, పొలం గట్టు మాటల్లో ప్రజలు పనిని చూసి మాట్లాడుతున్నారు.“ఎవరో వచ్చి చేతులు ఊపాడు అంటే సరిపోదు పని చేయాలి” అనే స్పష్టత పెరుగుతోంది.ఇది ప్రజాస్వామ్యానికి బలమైన సూచిక.

**అభ్యర్థుల పరుగు.. ప్రచార వైభవంలో జోరు**

ఎన్నికల వేళ అభ్యర్థుల ఇళ్లల్లో రద్దీ పెరుగుతుంది.పోటి చేసే ప్రతి వారు ‘మా కోసం పనిచేస్తా’అని చెప్పడం సహజం.కానీ ప్రజలు ఈసారీ ఆ మాటలను నమ్మే ముందు పదిసార్లు ఆలోచిస్తున్నారు.గ్రామానికి నీళ్లు వస్తాయా?పంచాయతీ రోడ్లు బాగవుతాయా?వీధి దీపాలు వెలుగుతాయా? చెత్త సమస్య తగ్గుతుందా?వీటిని నిజంగా పరిష్కరించగల అభ్యర్థుల గురించే ప్రజలు ఆలోచించాలి.

**మహిళా ఓటు.. ఎన్నికల ఫలితాన్ని మలిచే శక్తి**

స్వయం సహాయక బృందాలు, మహిళా సంఘాలు, గ్రామ మహిళలు ఇప్పుడు నిర్ణయాత్మక శక్తిగా మారారు. పాఠశాలలు, వ్యర్థ నిర్వహణ, పిల్లల భద్రత, తాగునీరు, పారిశుధ్యం ఇవి మహిళలు అత్యంత ప్రాధాన్యంగా చూస్తున్నారు. ఎవరు దీనిపై పని చేస్తారో వారికే మహిళా వోటు.

**యువత ప్రజాస్వామ్యానికి కొత్త శ్వాస**

యువకులు ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలను కేవలం రాజకీయంగా కాకుండా, గ్రామ అభివృద్ధి కోసం వేదికగా చూస్తున్నారు. నూతన ఆలోచనలు, సాంకేతికత, పారదర్శకత, గ్రామ డిజిటలైజేషన్‌వీటిని ముందుకు తెచ్చే నాయకుడే భవిష్యత్తు.

**ఓటు కేవలం హక్కు కాదు.. వాగ్దానం**

మన ఊరికి మంచిని కోరే పౌరుడిగా ఓటు వేయటం కేవలం హక్కు కాదు, బాధ్యత కూడా. అభివృద్ధి చేస్తానన్న మాటలు చెప్పేవారిని కాదు అభివృద్ధి చేయగలవారిని ఎన్నుకోవాలి. సర్పంచ్ ఎన్నికలు గ్రామాల భవిష్యత్తుకు పునాది వేస్తాయి. ఆ పునాది ఎంత బలంగా ఉండాలో నిర్ణయించేది మనమే.ఈసారి ఓటు వేసేది వ్యక్తికి కాదుమన గ్రామ భవిష్యత్తుకే. “మన ఊరు ముందుకు వెళ్లాలి మంచి నేతను ఎన్నుకోవాలి!” అనే ఆలోచనలో గ్రామాల ప్రజలు ఉన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**మొదటి పేజీ తరువాయి...**లోకేషన్ వివరాలు వెంటనే టి-పోల్ వెబ్ సైట్, యాప్‌లో నమోదు చేయాలని అన్నారు. టి-పోల్ వెబ్ సైట్ , యాప్ లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారిని నియమించాలని, ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఫిర్యాదులను మూడు రోజులలో పరిష్కరించాలని అన్నారు. నవంబర్ 23న ఫైనల్ చేసిన ఓటర్ జాబితా,పోలింగ్ కేంద్రాల ప్రకారం పంచాయతీ ఎన్నికల నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.2 కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న భవనం దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వెబ్ క్యాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలని , పోలింగ్ కేంద్రాలలో మంచి వెలుతురు, ఫర్నిచర్, పవర్ సరఫరా వంటి ఏర్పాట్లు చేయాలని అన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 27న ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలని అన్నారు.నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు పంచాయతీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలని అన్నారు.నవంబర్ 27 నుంచి నవంబర్ 29 వరకు ప్రతిరోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని అన్నారు.పంచాయతీ ఎన్నికలకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు వద్ద నామినేషన్ దాఖలు చేసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.నామినేషన్ల పరిశీలన నవంబర్ 30 న సాయంత్రం 5 గంటల వరకు పూర్తిచేసి చెల్లుబాటై నా నామినేటెడ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని అన్నారు.అభ్యర్థుల జాబితా పై అప్పీళ్ళ కోసం డిసెంబర్ 01, సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందని, డిసెంబర్ 2 నాడు ఆపీళ్ళ పరిష్కరించాలని,నామినేషన్ల ఉప సంహరణకు డిసెంబర్ 03 మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంటుందని, అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రచురణ చేయాలని అన్నారు.నామినేషన్ల స్వీకరణ, పరిశీలన,అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా అవసరమైన మార్గదర్శకాల జిల్లా ఎన్నికల అధికారులు జారీ చేయాలని అన్నారు.జిల్లాలో ఉన్న ప్రింటర్లకు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార కరపత్రాల ముద్రణ చేయవద్దని ఆదేశాలు జారీ చేయాలని, ఎన్నికల ప్రచారం సంబంధించి అభ్యర్థుల వ్యయ వివరాలను నమోదు చేసేందుకు ధరలను ఖరారు చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ లకు ఎన్నికల కమిషనర్ సూచించారు.ప్రతి మండలానికి ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, ఒక ఏ.ఈ.ఓ (సహాయ వ్యయ వివరాల నమోదు అధికారి), ప్రతి జిల్లాకు ఒక స్టాటిక్ సర్వేలెన్స్ బృందం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తప్పనిసరిగా జరిగేలా పర్యవేక్షించాలని అన్నారు.ప్రతి జిల్లాలో ఎం.సి.ఎం.సి కమిటి, జిల్లా మీడియా సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో వినియోగించే ఎలక్ట్రానిక్ వీడియోలకు ముందుగా ఎం.సి.ఎం.సి అనుమతి ఉండాలని అన్నారు. ఎన్నికల దృష్ట్యా తనిఖీలు నిర్వహించే నేపద్యంలో రైతులు పంట డబ్బులు తీసుకుని వెళ్లే సమయంలో తప్పనిసరిగా రశీదు పెట్టుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఎం.సి.సి అమలులో నిర్వహించే తనిఖీల లో నగదు, బంగారం, ఇతర పరికరాలు సీజ్ చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు అందించాలని, సీజ్ చేసిన పరికరాలకు సంబంధించిన ఆధారాలు సమర్పించేందుకు ఏ అధికారి ముందు హాజరు కావాలని అన్నారు.ఈ సమావేశంలో జెడ్పీ సిఈఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**మొదటి పేజీ తరువాయి...**

నేపద్యంలో డబ్బులు, మద్యం పంపిణీ చేసినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదే విధంగా 75 సమస్యాత్మక పోలింగ్



కేంద్రాలను గుర్తించామని, అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 5 చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫైయింగ్ స్క్వాడ్ బృందం, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాన్ని తనిఖీలు నిర్వహించే నెసద్యంలో డబ్బులు, మద్యం పంపిణీ చేసినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పోస్టర్లను రవాణా చేసే సమయంలో తగిన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 26 :** ధాన్యం కొనుగోలు ప్రక్రియ పగడ్బందీగా చేపట్టాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అలసత్వం వహించవద్దని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత తెలిపారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, తక్కళ్ళపల్లి, చిన్నపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ బి.ఎస్. లత ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియ చాలా పకడ్బందీగా, పక్కాగా జరగాలని,రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.రవాణా,గోనె సంచుల విషయంలో ఎక్కడ పొరపాటు దొర్లినా వెంటనే సమస్యను లోతుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నా మన్నారు.రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకం ధాన్యం 17 శాతం తేమ ఉన్నా కొనాల్సిందేనని స్పష్టం చేశారు. ధాన్యం తూకమైన వెంటనే రైతుకు రసీదు ఇవ్వాలని, ఆ తర్వాత ధాన్యం తరలింపు విషయంలో రైతుకు ఎలాంటి సంబంధం ఉండదని, మిల్లుకు తరలించే బాధ్యత సౌర సరఫరాల, వ్యవసాయ శాఖ అధికారులదేనని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన వసతులు కల్పించాలన్నారు. రైస్ మిల్లులు వద్ద ఎటువంటి జాప్యం లేకుండా దిగుమతి అయ్యేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు,సివిల్ సప్లయ్ అధికారులు, సెంటర్ ఇంచార్జులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**చురకలు ప్రతినిధి, కోరుట్ల నవంబర్ 26 :** భారత రత్న ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించి దేశానికి అందించిన మహత్తర రాజ్యాంగాన్ని స్మరించుకుంటూ బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాల యువజన సంఘం మరియు ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టారు ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించినందువల్లే ఈరోజు దేశంలో అన్ని మతాలు కులాలకు సమాన న్యాయం లభిస్తోంది ఆయన రాజ్యాంగం రూపొందించకపోయి ఉంటే దేశం ఈ స్థాయిలో పురోగతి సాధించేది కాదు అని పేర్కొన్నారు దేశం కోసం అంబేద్కర్ రాత్రింబవళ్ళు శ్రమించి రక్త మాంసాలను కరిగిస్తూ రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు ప్రస్తుతం కొంతమంది మనువాదులు అంబేద్కర్‌ను రాజ్యాంగాన్ని అవమానించే విధంగా ప్రవర్తించడం దారుణమని విమర్శించారు అంబేద్కర్‌పై గాని దళితులపై గాని అన్యాయం జరిగితే ఇకపై ఊరుకోబోమని హెచ్చరించారుఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు ఉయ్యాల నరసయ్య బలిజ రాజారెడ్డి అంబేద్కర్ మాల సంఘ అధ్యక్షుడు పొట్ట లక్ష్మణ్ కోశాధికారి సామల వేణుగోపాల్ సహాయ కార్యదర్శి కండ్లే మైకేల్ మాజీ కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ బద్ది సుజాత మురళీధర్ సామల గంగా నరసయ్య కాంగ్రెస్ నాయకులు పసుల కృష్ణ ప్రసాద్ బన్న రాజేష్ మ్యాదరి రాజేష్ మగ్గిడి వెంకటి సామల దశరథం ఉయ్యాల శేఖర్ చిట్యాల లచ్చయ్య బలిజ రాజశేఖర్ నల్లాల విక్రమ్ తదితరులు పాల్గొన్నారు

# అయోమయంలో కార్యకర్తలు

**-అవకాశం కొత్తవారికా... లేక పాతవారికా...?**

**-మూడు పార్టీల్లోని కార్యకర్తల మల్లగుల్లాలు**

**చురకలు విలేకరి, మల్లాపూర్, నవంబర్ 26 :** గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ కూయడంతో ప్రధానంగా కొన్ని పార్టీల్లోని కార్యకర్తల్లో మల్లగుల్లాలు మొదలయ్యాయి. గత కొన్ని రోజుల నుంచి ఆయా పార్టీల్లో అధికారం ఉన్న లేకున్నా పార్టీని జెండాను పట్టుకున్న వారినీ పట్టించుకోవడం లేదని కొత్తగా వచ్చిన గోడమీద పిల్లుల్లాంటి కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలున్నాయి.ముఖ్యంగా ఓ పార్టీలోని కార్యకర్తల్లో అయోమయం నాడు నేడు కార్యకర్తల్లో సమన్వయం కొరవడిందని, ఆదిపత్య పోరును ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది.నామినేషన్ల పర్వం మొదలైన నేపథ్యంలో ఈ యేడు ఎక్కువగా స్వతంత్ర పోరుకు సిద్ధమవుతున్నవారి సంఖ్య పెరిగే అవకాశం ఉండవచ్చనే సంకేతాలు మండలంలోని ఆయా గ్రామాల్లో మెండుగా కనిపిస్తున్నాయి. మండలాభివృద్ధిలో ఓపార్టీ సరైన న్యాయం చేయలేకపోయిందనే విమర్శలున్నా ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లను చీల్చేందుకు చూస్తున్న నాయకులు కొందరైతే రచ్చబండ పంచాయతీలెందుకని మరికొందరున్నట్లు తెలుస్తోంది.కొత్తగా పార్టీలోకి వచ్చి కార్యకర్తల వల్ల క్షేత్రస్థాయిలో నాటి నుంచి ఉన్న కార్యకర్తల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది.కాగా అవకాశం ఎవరికీ అందేనో వేచి చూడాల్సిందే.



# కన్నుల పండగ సుబ్రహ్మణ్య షష్టి



**చురకలు విలేకరి, మెట్ పల్లి, నవంబర్ 26 :** మెట్ పల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరణలో స్థాపించి దివ్య పదునె టంబడి ముందు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పంచామృతాల తో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శతనామావళి, అంగపూజ, పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చి స్వామివారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో కార్యనిర్వహక అధ్యక్షుడు గంగుల వివేక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు దోమటి ప్రవీణ్, ఆలయ గురు స్వామి మంత్రి అంజయ్య, ఆలయకమిటి ఉపాధ్యక్షుడు అంకతి భరత్ కుమార్, మెట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, సహకారసంఘ చైర్మన్ కొమిరెడ్డి తిరుపతి, ఇబ్రహింపట్నం తహశీల్దార్ వరప్రసాద్, అలయ కమిటీ కోశాధికారి బండారి మారుతి, కార్యదర్శి ఉజ్జగిరి శ్రీనివాస్, సహయ కార్యదర్శి చిలమంతుల శివ, అవుట్ల లక్ష్మణ్,మణిస్వామి, కోలిపాక రాజు, బసెట్టి హరిష్ అయ్యప్ప స్వామి దిక్ష పరులు, మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నిర్మూలనపై అవగాహన సదస్సు



**చురకలు విలేకరి, ధర్మపురి, నవంబర్ 26 :** ధర్మపురి మండలంలోని దోనూర్ లో బుధవారం బాల్య వివాహాల నిరోధన పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్య నేరమని, 18 సంవత్సరాల లోపు అమ్మాయిలకు 21 సంవత్సరాలు లోపు అబ్బాయిలకు పెళ్లి చేయడం చట్టరీత్య నేరం దీనికి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు లక్ష జరిమానా విధించబడుతుందని తెలిపారు. సమాచారం, సహాయం కోసం మరియు పిల్లలను కాపాడుకోవడం కోసం 1098కి కాల్ చేయలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సీత లక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కుసుమ, అంగన్వాడి ఉపాధ్యాయురాలు రాజేశ్వరి జలజ రాజ్యలక్ష్మి, ఆశ వర్కర్ మానస, బాల బాలికల కౌన్సిలర్ జాన్సన్, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సందేశాత్మక చిత్రం కలివి వనం



**చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 26 :** రాజ్ నరేంద్ర దర్శకత్వంలో నిర్మించిన చిత్రం కలివి వనం సేవ్ ఫారెస్ట్ సేవ్ లైఫ్ అనే నినాదంతో రూపొందించిన చిత్రం అని, ముందుతరాలకు ఇది చాలా ఆలోచించేవిధంగా ఉంటుందని కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల అధినేత గుండేటి రాజు కొనియాడారు. బుధవారం స్థానిక శ్రీనివాస థియేటర్ ప్రదర్శిస్తున్న సందర్భంగా ఈ కలివి వసం చిత్రంలో నటించిన జగిత్యాలకు న్యాయవాది నటుడు భూసారపు శ్రీనివాస్ గౌడ్‌ను సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు. భవిషత్తులో మరిన్ని చిత్రాలలో నటించి జగిత్యాల జిల్లాకు పేరు తేవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, విశ్వ బ్రాహ్మణ సేవ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సంకోజి వెంకట రమణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అలిశెట్టి రాజు, కందుకూరి నాగరాజు, పడాల సత్యం, జగిత్యాల జిల్లా పోపా కార్యదర్శినండే గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**చురకలు విలేకరి, ధర్మపురి, నవంబర్ 26 :** ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెందోలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద 76వ భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ పుస్తకాన్ని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చందోలి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారానే ఎస్సీ వర్గీకరణ జరిగిందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అనే మూడు దారిచూపు స్తంభాలపై నిలిచిన మహోన్నత గ్రంథం మన భారత రాజ్యాంగం, దేశాన్ని ముందుకు నడిపించే ప్రతి పౌరుడికి పథకదారి, భారత ప్రజాస్వామ్యానికి శక్తి, భారత జాతికి గౌరవ ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల రాష్ట్ర కార్యదర్శి పరపెల్లి రాజమల్లయ్య, దళిత సంఘాల నాయకులు పరపెల్లి లక్ష్మణ్, బత్తిని నరేష్, నాయిళ్ళ రవికుమార్, మరంపెల్లి చంద్రయ్య, పసుల బుచ్చయ్య, దుర్గం రవి, చిలుముల బాబు,దుమ్మళ్ళ పూర్ణ చందర్, ఒరగంటి వంశీ, బొల్లరపు ప్రణయ్, బత్తిని సుధాకర్,బత్తిని అరవింద్, దుమ్మళ్ళ రాహుల్,బత్తిని వినయ్ మౌల్లరపు వినయ్,బడుగు సుజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**-జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్రావు**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 26 :** ఈనెల 29న నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్రావు అన్నారు. బుధవారం జిల్లా బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మాజీ సీఎం కేసీఆర్ చేసిన ఉద్యమ పోరాటంలో దీక్షాదివ సక్కు ఓప్రత్యేకత ఉందని, నాడు కేసీఆర్ చేపట్టిన దీక్షతోనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసిందని గుర్తు చేశారు. ఈ నెల 29న జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించే దీక్షాదివస్ కార్యక్రమానికి జిల్లాలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్, మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్, మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వదేశీ ఉత్పత్తులనే వాడాలి

**-బిజెపి జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు**



**చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 26 :** భారతదేశం ఇతర దేశాల ఉత్పత్తులపై ఆధారపడకుండా దేశాన్ని ఆర్థిక సామాజిక పారిశ్రామిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఇతర నైపుణ్యాలతో దేశీయ ఉత్పత్తులను పెంచి స్వయం ఆధారిత దేశంగా మార్చడమే లక్ష్యంగా ఆత్మ నిర్భర భారత్ పథకం లక్ష్యమని స్వదేశీ ఉత్పత్తులనే వాడాలని బిజెపి జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆత్మ నిర్భర భారత్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతూ 2020సంవత్సరంలో కరోనా మహమ్మారితో రెండు సంవత్సరాల పాటు ప్రపంచాన్ని గడగడ లాడించిన సమయంలో ప్రపంచంలోని చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నా భిన్నం అయ్యాయని కానీ భారత ప్రధాని నరేంద్ర మోడీ తీసుకువచ్చిన ఆత్మ నిర్భయ భారత్ పథకం పేరుతో ప్రత్యేక నిధులు కేటాయించి మేక్ ఇండియా మేడ్ ఇండియా స్కిల్ ఇండియా పేరుతో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో వస్తు సేవల ఉత్పత్తులను తయారు చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేసి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా తీసుకువచ్చారని అన్నారు.గతంలో భారతదేశం రక్షణ మరియు ఇతర రంగాలకు సంబంధించిన ఆయుధ సంపత్తిలో ఇతర దేశాలపై ఆధారపడ్డారని కానీ నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ లో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన బ్రహ్మోస్ మిస్సైల్స్ ను చూసి ప్రపంచమే నివ్వెర పోయిందని అన్నారు.తరువాత ఇతర దేశాలు భారత నైపుణ్యాన్ని మెచ్చుకొని ఆయుధ సంపత్తిపై భారతదేశంపై ఆధారపడి ఆయుధ సంపత్తి కొనుగోలుకు క్యూ కట్టాయని అన్నారు. అంతే కాకుండా ఇతర దేశాల్లో ఉత్పత్తి అయిన ఐఫోన్ కంటే భారత్లో ఉత్పత్తి అయిన ఐఫోన్లు నాణ్యతగా ఉండడం వల్ల ఇతర దేశాలకు చెందిన వారు అధికంగా కొనుగోలు చేయడం వల్ల భారత్ కు డిమాండ్ పెరిగిందని అన్నారు. మోడీ దేశ అభివృద్ధికి తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాల వల్లనే పదకొండవ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ నాలుగవ స్థానానికి చేరుతుందని అన్నారు.

# జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం

**చురకలు విలేఖరి, నవంబర్ 26 :** ఇంటి యజమాని మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకంలో ఆర్థిక సహాయం అందుతుందని పెగడపల్లి ఐకెపి ఎపిఎం రవివర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్బిఎస్) పథకంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలలో ప్రధాన జీవనాధారుడు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ. 5000 రూ.ల నుండి 20,000 రూ.ల వరకు సహాయంగా అందించబడుతుందని ఐకెపి ఎపిఎం రవివర్మ తెలిపారు. ఎన్ఎఫ్బిఎస్ పథకానికి తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న కుటుంబం మాత్రమే అర్హులని, 18 సం.ల నుండి 60 సం.ల లోపు వయస్సు గల వారు ఎన్ఎఫ్బిఎస్ లో అర్హులవుతారని, తేదీ: 01/04/2017 తరువాత చనిపోయిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. భారతదేశ పౌరుడై ఉండి, దారిద్ర్యరేఖకు (బిపిఎల్) దిగువన ఉన్న కుటుంబంలో నివసిస్తున్న వారై ఉన్నవారు, కుటుంబంలో ప్రాథమిక జీవనాధారం అందించే వ్యక్తి మరణించి ఉ ఉన్నవారు, మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యుల వయసు 18 సంవత్సరాల కంటే ఎక్కువ 60 సంవత్సరాల కంటే తక్కువ ఉ ఉన్నవారు, కుటుంబంలో తదుపరి ప్రాథమిక సంపాదన పరుడై ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత ఉన్నవారు ఎన్ ఎఫ్ బి ఎస్ అప్లికేషన్ కు డెత్ సర్టిఫికెట్, ఎఫ్ఎస్సి కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్,ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆర్ ఐ రిపోర్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్, అఫిడవిట్స్, తహసీల్దార్ రికమండేషన్ లెటర్, బ్యాంక్ ఖాతా పాస్బుక్ జిరాక్స్, ఏపిఎం సెర్ప్ నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జతపరిచి కావాల్సిన పత్రాలతో మీసేవ కేంద్రాలలో లేదా నేరుగా మండల తహసీల్దార్ కు దరఖాస్తు చేసుకోవాలని పెగడపల్లి ఐకెపి ఎపిఎం రవివర్మ కోరారు.

# సొంత ఇంటి కల నెరవేర్చిన మంత్రి శ్రీధర్ బాబు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ నవంబర్ 26 :** సొంత ఇంటి కలను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నెరవేర్చగా లబ్ధిదారుడు వీడియోతో కృతజ్ఞతలు తెలిపారు.రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన గొల్లపల్లి అభిలాష్ గౌడ్ కు ప్రియతమ నాయకులు రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి ప్రత్యేక చొరవతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంపట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా,నేడు నిర్వహించిన దార్వాజ పూజ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి తో పాటు కాంగ్రెస్ నాయకులు మేకల మారుతి పాల్గొన్నారు.అభిలాష్ తన చిన్నతనంలో తన తండ్రి చనిపోవడం జరిగింది. అభిలాష్కు తండ్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్టు ఎలా ఉంటుందో ఏఐ టెక్నాలజీ ద్వారా రూపొందించిన వీడియోను అభిలాష్ కు అందజేయగా, ఆయన ఎంతో భావోద్వేగంతో ఆనందం వ్యక్తం చేశారు.మన ప్రేమించిన వ్యక్తుల జ్ఞాపకాలను ఏఐ సాంకేతికత ద్వారా వీడియో రూపంలో చేసి వారి జ్ఞాపకాలను గుర్తు చేసినందుకు మాజీ జెడ్పీటీసీ వెంకటరమణరెడ్డి మేకల మారుతికి అభినందనలు తెలియజేశారు .అలాగే ప్రస్తుతం ఐటీ శాఖామాత్యులు శ్రీధర్ బాబు నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రానికి విపరీతంగా ఐటి పెట్టుబడులు ఆకర్షితమవుతున్నాయని, దీనితో యువతకు వేలది ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బూడిద రాజేందర్, ఎరవేణి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపైపోలీస్ కళాబృందంచే విద్యార్థులకు అవగాహన



**చురకలు, విలేఖరి, వెల్గటూర్,నవంబర్ 26 :** జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు వెల్గటూర్ మండలంలోని కుమ్మరిపల్లి మోడల్ స్కూల్లో ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కళాబృందం చేత పోలీసు చట్టాలు, షీ టీం, సైబర్ నేరాలు,గంజా నిర్మూలన,రోడ్డు ప్రమాదాలపై కుమ్మరిపల్లె గ్రామ మోడల్ స్కూల్లో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.క్రమశిక్షణ,డయల్ 100,వివిధ పోలీసు చట్టాల పైన పోలీస్ కళాబృందం పాటలు,ప్రసంగాలు,సాంస్కృతి క కళాప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై ఉదయకుమార్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి బావి భారత పౌరులని,సైబర్ నేరాల పట్ల మోసపోవద్దని, చైతన్యంతో మెలగాలని, గొప్ప చదువులు చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకుసూచించారు.ఈకార్యక్రమంలో స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపల్,అధ్యాపక బృందం,విద్యార్థులు,పోలీస్ కళాబృందం సభ్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదానికి కారణమైన వ్యక్తికి జైలుశిక్ష,జరిమానా

**చురకలు ప్రతినిధి, జగిత్యాల,నవంబర్ 26 :** అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైనా ఆదువాల నరేసు 4నెలల జైలుశిక్ష, రూ.200 మిజరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీనిజ కోహీర్కర్ బుధవారం తీర్పును వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2020 జూలై 30న జగిత్యాల పట్టణ శివారులో ఆదువాల నరేష్ తన వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి షేక్ ఫజల్ రహేమాన్ వాహనాన్ని ఢీకొట్టగా, ఫజల్ రహేమాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఫజల్ రహేమాన్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ అనిల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఆదువాల నరేష్ ను కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి శ్రీనిజ కోహీర్కర్ ప్రమాదానికి కారణమైన ఆదువాల నరేష్ కు 4నెలల జైలుశిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 26 :** భారత రాజ్యాంగం ఆమోదించి 76 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి శ్రేణులు రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నలువాల తిరుపతి,శ్రీనివాస్, భూమి రమణ, సాంబారి కళావతి,రమ,గంగారాజం,దివాకర్,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్లన్నస్వామి సన్నిధికి భారీగా భక్తజనం

**-స్వామివారికి బోనాల సమర్పించిన భక్తులు**

**చురకలు విలేకరి, గొల్లపల్లి, నవంబర్ 26 :** గొల్లపల్లి మండలంలోని మల్లన్న పేట గ్రామంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీమల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం దండివారం సందర్భంగా వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా భద్రతా ఏర్పాట్లను జగిత్యాల డిఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి, గొల్లపల్లి ఎస్ఐ కృష్ణాసాగర్ రెడ్డిలు పర్యవేక్షించారు. జాతరలో భాగంగా ఆలయానికి రూ.84,860 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్ట్ కొండూరి శాంతయ్య, ఆలయ ఈవో విక్రమ్ లు తెలిపారు.

# ఘనంగా ప్రారంభమైన శ్రీ దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవాలు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ నవంబర్ 26 :** మంథని పట్టణంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయంలో బుధవారం శ్రీ దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవములు ఘనంగా ప్రారంభమైనాయి.తొమ్మిది రోజులపాటు జరిగే నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోనున్నారు.ఆలయంలో జరిగే దైవ కార్యక్రమాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు.షష్టి తిథి నుండి పౌర్ణమితి వరకు జరిగే నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు హెూమగుండం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు. దూర్వాస మహర్షి అంబరీసునకు ఇచ్చిన శాపములను విష్ణుమూర్తి గ్రహించి



అనేక అవతారంలో స్వీకరించారు. వాటిలో శ్రీ దత్తాత్రేయ అవతారం ఒకటి.ముఖ్యంగా ఈ అవతార ఉద్దేశము ప్రజలు సులభంగా మోక్షము పొందుటకు యోగాభ్యాసమును అభివృద్ధి పరచుట కొరకై అవతరించిన అవతారమే శ్రీ దత్తాత్రేయ అవతారం. మార్గశిర శుద్ధ పౌర్ణమి రోజున శ్రీ దత్తాత్రేయ స్వామి జన్మదినం.శ్రీ దత్తాత్రేయ అవతారము శాశ్వతముగా నిలిచే అవతారము.ఆ క్రమంలో పిఠాపురంలో శ్రీపాద శ్రీవల్లభునిగా, కరంజాలో శ్రీ నరసింహ సరస్వతిగా, షిరిడిలో శ్రీసాయినాథునిగా అవతరించి జనులకు సుఖసంపదలను ప్రసాదిస్తు న్నారు.రాత్రి 7గంటల నుండి10 గంట ల వరకు 9 రోజులపాటు ప్రత్యేకంగా భజన కార్యక్రమం నిర్వహిస్తారు. పట్టణంలోని అన్ని వాడల నుండి భక్తులు పాల్గొని కార్యక్రమములో పాల్గొంటారు. తొమ్మిది రోజులపాటు ఆలయంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుంది.ఈ సందర్భంగా గ్రామం లోని పురవీధుల గుండా నవరాత్రుల చివరి రోజున శ్రీ దత్తాత్రేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు.నవరాత్రి ఉత్సవములు అనంతరం అష్టమి తిథి రోజు శ్రీ అనగా దేవి వ్రత కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ పూజారి కొల్లారపు వెంకట రాజం తెలిపారు.

# అందరి ఆరాధ్య దైవం బాబాసాహెబ్ అంబేద్కర్

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ నవంబర్ 26 :** అందరికీ ఆరాధ్య దైవం బాబాసాహెబ్ అంబేద్కర్ అని జూలపల్లి మాజీ సర్పంచ్ గొల్లపల్లి శంకర్ గౌడ్, బాబా సాహెబ్ అంబేద్కర్ అవార్డు గ్రహీత ఇరుగు రాళ్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల ఆదర్శనగర్‌లో భారత రాజ్యాంగం బాబాసాహెబ్ అంబేద్కర్‌కు పూల మాలలు వేశారు.భారత రాజ్యాంగం పూర్తయి 76సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్ కు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం వల్ల నేడు ప్రతి ఒక్కరికి హక్కులు కలుగుతున్నాయని అలాగే రిజర్వేషన్లు భారత రాజ్యాంగం వల్లనే కలుగుతున్నాయని అన్నారు.ఆయా మహానుభావుని రాజ్యాంగం వల్లనే ఎంపీలు ఎమ్మెల్యేలు తమ తమ రిజర్వేషన్లు పొందుతున్నారని పేర్కొన్నారు. ఆ మహానుభావుని అడుగుజాడల్లో నడిచే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు.అంబేద్కర్ సంఘ రాష్ట్ర నాయకులు కుక్క చంద్రమౌళి, మాజీ



ఎంపీటీసీ శివశంకర్, గ్రామ కార్యదర్శి అంబటి శంకర్,ఐఎన్టియుసి నాయకులు గునిగంటి వెంకటస్వామి, ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కల్లేపల్లి నర్సింగం, వివిధ పార్టీల నాయకులు రెబల్ రాజ్ కుమార్, బొమ్మగాని అనిల్ గౌడ్, ఆడెపు రమేష్, ఇరుగు రాళ్ల భాగ్యలక్ష్మి, తిరుపతి మధునయ్య, పోశం, ఓదెలు, సుధాకర్, రాయ మల్లు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

**-భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమానులు వేసి నివాళు లర్పించిన నాయకులు**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 26 :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఎమ్మార్పీఎస్ నాయకులు,స్థానిక అంబేద్కర్ నగర్ కు చెందిన దళిత నాయకులు,ప్రజా ప్రతినిధులు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు.రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు మొదట పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఖానాపూర్ లక్ష్మన్ మాదిగ,



జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్ భాయి, ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా 2015 నుంచి భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు .రాజ్యాంగ నిర్మాణం వల్లే నేడు అన్ని రకాల రిజర్వేషన్‌లతో పాటు ఎన్నికల్లో రాజకీయ, ఉద్యోగ రిజర్వేషన్‌లు సాధిం చడం జరుగుతుందన్నారు. రాజ్యాంగం వల్లే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని దేశంలో కొన్ని పార్టీలు కుట్రలు కుతంత్రాలు పన్నుతున్నాయని అంబేద్కర్ ద్వారా సాధించుకున్న రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సినటువంటి బాధ్యత మనందరిపై ఉందన్నారు.పాఠశాలలు, కళాశాలల్లో రాజ్యాంగ సంబంధిత కార్యకలాపాలు ,సమానత్వం కోసం పరుగు,ప్రత్యేక పార్లమెంటరీ సమావేశాలు నిర్వహించుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య,ఎఎంసి వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్ని బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిళ్ళ లింగాగౌడు,బండారి బాల్ రెడ్డి, నంది కిషన్,మెండే శ్రీనివాస్ యాదవ్ అంతేర్పుల గోపాల్,మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు అంతేర్పుల ఎల్లయ్య, కనకరాజు, శనిగరపు బాలరాజు,పందిర్ల శ్రీనివాస్ గౌడ్ నవాబ్ సోషల్ మీడియా ప్రతినిధి భీపేట రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగ దినోత్సవం సందర్బంగా ప్రతిజ్ఞ

**చురకలు ప్రతినిధి కరీంనగర్, నవంబర్ 26 :** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులు, సిబ్బంది చేత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.ఈ




సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమైన మన దేశ రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు వుందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, దేశ అభివృద్ధికి కట్టుబడి వుండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిష నల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఏవో సుధాకర్,వివిధ శాఖల అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి పూజ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట నవంబర్ 26 :** శ్రీ హరిహరపుత్రఅయ్యప్ప దేవాలయం అల్మాసుపూర్ గ్రామంలో సుబ్రహ్మణ్య షష్ఠి పూజను ఘనంగా నిర్వహించారు శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో..దేవాలయ అర్చకులు మరింగంటి పురుషోత్తమ చార్యులు వేద మంత్రాలతో సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకం,గంధాభిషేకం,భస్మాభిషేకం,పుష్పాభిషేక, నిర్వహించారు. కాల సర్పదోషం,కుజదోషం,నివారణకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు, అయ్యప్పస్వామి,మహిళలమంగల హారతులతో,హరోం హర,హరోం హర అంటూ..షణ్ముకున్ని భక్తులు కొనియాడి మొక్కులు చెల్లించి కున్నారు.

## మహిళలను వేధిస్తే షీ టీంకు సమాచారం ఇవ్వాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ నవంబర్ 26 :** రామగుండం సి.పి ఆదేశాల మేరకు,పెద్దపెల్లి షీ టీమ్ వారు, ఎన్టిపిసి పిటిఎస్ లోని కేంద్రియ విద్యాలయం కె.వి స్కూల్ మరియు జూనియర్ కాలేజీ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం ఇంచార్జ్ SI లావణ్య గారు మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్, అనగా డ్రగ్స్ మరియు చెడు అలవాట్లకు అబ్బాయిలు దూరంగా ఉండాలని, అమ్మాయి ల జోలికి వెళ్తే ఎలాంటి చర్యలు తీసుకోబడుతాయానీ తెలిపారు, ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక,సురేష్,స్నేహలత, ప్రిన్సిపాల్ శోభన్ బాబు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా సరిహద్దులో చెక్ పోస్ట్ ఎర్పాటు



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (26) :** స్థానిక సంస్థల ఎన్నికల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన క్రమంలో బుధవారం జగిత్యాల జిల్లా సరిహద్దు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గండి హనుమాన్ వద్ద పోలీస్ చెక్ పోస్ట్ ఎర్పాటు చేశారు.ఈసందర్భంగా ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు.ఎలాంటి ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో డబ్బులతో గానీ మద్యంతో గానీ రవాణా చేసినట్లయితే అట్టి డబ్బులు లేదా మద్యాన్ని సీజ్ చేయబడుతుందని ఎస్ఐ అనిల్ సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ రవాణా

**-అధిక డబ్బులు వసూలు చేస్తున్న దళారులు**
**-ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఇసుకాసురులు**



**చురకలు విలేఖరి, పెగడపల్లి నవంబర్ 26 :** జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది.కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని కొరటపల్లి, రామడుగు వాగుల నుండి, కరీంనగర్ దగ్గరలోని ఇరుకుల్ల,నీరుకుల్ల వాగుల నుండి,జగిత్యాల జిల్లాలోని బీర్పూర్, ధర్మపురి లోగల గోదావరినది తీర ప్రాంతాల నుండి,పెగడపల్లి మండలం లోని పరిసర గ్రామాల వాగుల నుండి, ఒర్రెల నుండి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో సన్నపు ఇసుకను, దొడ్డు ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా రవాణా చేస్తున్నారు.ఇసుక దళారులు మరింత దూకుడుగా మారి అధికంగా డబ్బులను వసూలు చేస్తూ,ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు.ఉదయం, రాత్రి, పట్ట పగలు, సాయంత్రం ట్రాక్టర్లతో, టిప్పర్లతో పెగడపల్లి మండలంలోని అన్ని గ్రామాలకు ఇసుకను అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు అధిక ధర వసూలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక మాఫియాలు భారీగా అక్రమ ధనార్జనకు పాల్పడుతున్నాయి.అధికారులు వెంటనే స్పందించి, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో జరుగుతున్న ఈ అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.

### సింగసముద్రం నుండి గిద్ద చెరువు వరకు

# నీటి కాలువ పూడిక తీయించాలి

**-ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన ఆయకట్టు రైతులు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 26 :** సింగసముద్రం నుండి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్ద చెరువు వరకు నీటి కాలువ ఉపాధి హామీ కూలీలచేత పూడిక తీయించాలని ఆయకట్టు రైతులు ఎల్లారెడ్డిపేట మండల అభివృద్ధి అధికారి సత్తయ్యకు వినతి పత్రం సమర్పించారు.సింగ సముద్రం నుండి ఎల్లారెడ్డిపేట గిద్ద చెరువు వరకు నీటి కాలువ పురాతన కాలం నుండి ఉందని ఇట్టి కాలువ ద్వారా వచ్చే నీటితో ఆయకట్టు రైతులు పంట పండించుకోవడం జరుగుతుందని,లింగసముద్రం నుండి వచ్చే వరద కాలువలు చెత్త చెదారంతో నిండిపోయి పూడిక మట్టితో కూరుకు పోయాయని దీంతో సరిగా నీరు రాకపోవడంతో తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఎంపీడీవోకు వివరించారు.ఇట్టి కాలువల ద్వారా నీరు వస్తేనే తమ యొక్క పంట పొలాలు సమృద్ధిగా పండుతాయని వెంటనే ఉపాధి హామీ పథకం కింద సింగసముద్రం నుండి గిద్దె చెరువులోకి తదితరసమృద్ధిగా పండుతాయని వెంటనే ఉపాధి హామీ పథకం కింద సింగసముద్రం నుండి గిద్ద చెరువులోకి వచ్చే కాలుతోపాటు తదితర కాలువల పూడికతీసి చెరువు లోకి నీరు వచ్చే విధంగా చూడాలని ఎంపీడీవోకు విజ్ఞప్తి చేశారు.ఎంపీడీవోను ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి ఎల్లారెడ్డిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్ని బాబు ఆయకట్టు రైతులు బందారపు మల్లారెడ్డి,లింగాల దాసు,మంకెన రాజిరెడ్డి,మద్దుల పద్మారెడ్డి,గుండాడి వెంకట్ రెడ్డి,రావుల మల్లారెడ్డి,కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,ఓగ్గు రవి,బంధారపు దేవేందర్ రెడ్డి లు కలిసి వినతిపత్రం సమర్పించారు.

# ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలి

**-ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట నవంబర్ 26 :** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నోడల్ అధికారులు తమ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.నోడల్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఎస్పీ మహేష్ బి గీతే,అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి సమావేశమై,వారి విధుల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ,నోడల్ అధికారుల విధులు,బాధ్యతలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాబోయే ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం చేపట్టినట్లు తెలిపారు. మానవ వనరుల నిర్వహణ,శిక్షణ,రవాణా,మోడల్ కోడ్ కండక్ట్,ఖర్చు పర్యవేక్షణ,పోస్టల్ బ్యాలెట్ ,ఎలక్టోరల్ రోల్స్,ఎన్నికల పరిశీలకులు విషయమై నోడల్ అధికారుల నియామకం చేసినట్లు తెలిపారు.వివిధ అంశాలకు సంబంధించి నియామకం చేసిన నోడల్ అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలకు సంబంధించి అన్ని విధాలుగా సర్వసన్నద్ధం కావాలన్నారు.



ఎన్నికల నిబంధనలు సమగ్రంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు.ఎన్నికల నిర్వహణకు సరిపోను సిబ్బందిని సమకూర్చుకోవాలన్నారు. పర్యవేక్షణ బృందాల రవాణాకు కావాల్సిన వాహనాలు సిద్ధపర్చుకోవాలన్నారు.వివిధ రకాలుగా జిల్లా యంత్రాంగానికి వచ్చే ఎన్నికల ఫిర్యాదులను వేగంగా,క్వాలిటీ పరిష్కారం చూపేలా సన్నద్ధం కావాలన్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సమావేశంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్,డీపీఓ శర్ఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్షునికి సన్మానం

**చురకలు విలేకరి, గొల్లపల్లి, నవంబర్ 26 :** జగిత్యాల డిసిసి అధ్యక్షునిగా ఎన్నికై తొలిసారిగా గొల్లపల్లికి వచ్చిన గాజంగి సందయ్యను మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు సరసాపురం రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు నేరెళ్ల రాజిరెడ్డి, బుర్ర ఆంజనేయులు గౌడ్, గాజంగి రాజేశ్వరి సత్తన్న, చిట్యాల గంగజమున, నక్క మీనాక్షి గంగయ్య, రాంప్రసాద్, ఎల్లంకి



పద్మ రమేష్, అంకుస్, సుస్మిత్, రాపల్లి రవీందర్, వెంగారాపురం రవీందర్, పెద్ది సాంబయ్య, బొంకూర్ విజయ్, డట్నూరు శ్రీనివాస్, చందోలి పరశురాములు, ఆత్మకూరు స్వామి, సునంద తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ నవంబర్ 26 :** పాలకుర్తి మండలం జీడి నగర్ కు చెందిన యూనివర్సల్ ఐఐటి పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు.ఈ నెల 15వ తేదీన పెద్దపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభకనబరిచి అండర్ 13 బాలికల విభాగంలో జోయా శ్రీ, అండర్ 15 బాలికల విధాగంలో O.కార్తీక, అండర్ 15 బాలుర విభాగంలో కె నిఖిలేశ్వర్‌లు ఎంపికయ్యారు.ఈనెల 28, 29, 30 తేదీలలో ఫైర్ఫాక్స్ స్పోర్ట్స్ మరియు రిసార్ట్స్ మొయినాబాద్, హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనను న్నారని వ్యాయామ ఉపాధ్యాయులు కల్వల సంతోష్ తెలియజేశారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్ గారు ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్ గారు విద్యార్థులను అభినందించారు.

## రాష్ట్ర కోశాధికారిగా గుగులోతు హుస్సేన్ నాయక్

**-రాష్ట్ర ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఎన్నిక**



**చురకలు ప్రతినిధి,హనుమకొండ, నవంబర్ 26 :** ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టిడబ్ల్యూజేయు) రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం హైదరాబాదులోని గిరిజన విద్యుత్ భవన్ లో కోర్ కమిటీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా గుగులోతు హుస్సేన్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గుగులోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర కోశాధికారి గా నన్ను నియమించినందుకు గాను రాష్ట్ర యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఉన్నటువంటి జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని, జర్నలిస్టుల సమస్యలను ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు.

## డిసిసి అధ్యక్షులు ఇనగాలకు ఘన సన్మానం

**- సన్మానించిన కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా కమిటీ**



**చురకలు ప్రతినిధి,హనుమకొండ నవంబర్ 26 :** వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హనుమకొండ డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా బుధవారం రోజున కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఇనగాల వెంకట్రాంరెడ్డి ని శాల్వతో ఘనంగా సన్మానించారు. పూలబొకతో శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ అధ్యక్షుడు తాళ్లపల్లి రాజు, ఉపాధ్యక్షులు గోవిందు మహాభాను, నిట్టి బాలరాజు, జిల్లెల కృష్ణమూర్తి, సముద్రాల సోమయ్య, జనరల్ సెక్రెటరీ తాటికొండ ప్రసాద్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ రాజు, పరకాల మండల అధ్యక్షుడు దుమల కిషోర్, నడుకుడ మండల అధ్యక్షుడు మేకల కుమారస్వామి, పరకాల బ్లాక్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు పల్లె రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తనుగుల చెక్ డ్యామ్ ఘటనలో ఏది నిజం?

**-నాణ్యత లోపమా?**
**పేల్చేశారా ?**
**-ఎన్నో అనుమానాలు**
**-పొలిటికల్ వార్‌గా మారిన చెక్ డ్యాం అంశం**



**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్)**

హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మండలం తనుగుల సమీపంలోని మానేరు వాగులో చెక్ డ్యాం కూలిన వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల చెక్ డ్యాం కూలిన విషయం తెలిసిందే.చెక్ డ్యామ్ దెబ్బతిన్న విషయమై నీటిపారుదల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి ఇప్పటికే పోలీసులకు విచారణ చేయాలంటూ..ఫిర్యాదు చేసారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఘటన స్థలాన్ని సందర్శించారు విచారణకు ఆదేశించారు.పోలీసు సాంకేతిక విభాగం కూడా విచారణ చేస్తోంది.కాగా రెండు రోజుల క్రితం మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు,ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి,గంగుల కమలాకర్,డా. సంజయ్ తదితరులు చెక్ డ్యామ్ సందర్శించి ఇసుక మాఫియా వెనుక కాంగ్రెస్ నేతల హస్తం ఉందని,దీని జిలెటిన్ స్టిక్స్ తో పేల్చేశారని దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.కాగా హరీష్ రావు ఆరోపణలు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ ఖండించారు. చెక్ డ్యామ్ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించారని, నాణ్యతా లోపంతో కూలిందని వారు ఆరోపించారు. కాగా దీనిపై బిజెపి నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా స్పందించారు. చెక్ డ్యాములు బిఆర్ఎస్ హయాంలో నాణ్యతా లోపాలతో నిర్మించారని అయన ఆరోపించారు. వీటిపై సమగ్ర విచారణ జరపాలని, కమీషన్ల కోసమే నిర్మించారని అయన ఆరోపించారు. ఇదిలా ఉంటె. మంత్రి హరీష్ రావు తావు రాష్ట్రంలో రైతుల కోసం 1200 చెక్ డ్యాములు నిర్మించామని ఎంతో వరద వచ్చినా కూలిపోని చెక్ డ్యామ్ వరద లేనప్పుడు ఎలా కూలిందని, దీని వెనుక కాంగ్రెస్ నేతల హస్తం ఉందని ఆరోపించారు. నాణ్యత లోపమైతే... అది నిర్మించింది మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కాన్స్ట్రక్షన్ కంపెనీ అని దాన్ని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆరోపించారు. కాగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు చెక్ డ్యామ్ సందర్శించారు.విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..అది నాణ్యత లోపంతో కూలిందని, పేల్చి వేశారని నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేసారు. తాజాగా బుధవారం బి ఆర్ ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్,ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైదరాబాద్ తెలంగాణా భవన్‌లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి ఇది జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చారంటూ.. ఓ వీడియో ప్రదర్శించారు.ఒకవైపు అధికారులు చెక్ డ్యామ్ కూలిన విషయంలో విచారణ చేస్తుండగా..ఈ విషయం రాజకీయ పార్టీల మధ్య వార్ కు తెరలేపింది.ఇదిలాఉంటే. వాస్తవాలు బయటకు తీయాలని, అధికారులు ఈ విషయమై నిజాల్ని నిగ్గ తేల్చాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు ఇసుక మాఫియా మానేరు పై చెలరేగిపోతోంది. ఇంత రాద్ధాంతం జరుగుతున్నప్పటికీ.. బుధవారం కూడా ఇసుక ట్రాక్టర్లు మానేరు వాగులో కనిపించడం గమనార్హం. పోలీసు, రెవిన్యూ, రవాణా, మైన్స్ అధికారుల నిర్లక్ష్యం, వత్తాసు వల్లే ఇసుక దందా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### మైనారిటీ గురుకులం ఉపాధ్యాయుడిని

# విధుల నుంచి తప్పించిన సెక్రటరీ షఫీఉల్లా



**-విద్యార్థిని చేయి విరగొట్టిన యుటిఎఫ్ టేమ్రీస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వొల్లాల శ్రీనివాస్ సస్పెండ్**

**కరీంనగర్ రూరల్, నవంబర్ 26** : కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ విట్స్ కళాశాల కాంప్లెక్స్ లో నిర్వహించబడుతున్న ప్రభుత్వ మైనారిటీ గురుకుల కళాశాల-1 సీవోఈలో పిజిటి ఇంగ్లీష్ -1 గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వొల్లాల శ్రీనివాస్ ను, విధుల నుంచి సస్పెండ్ చేస్తూ బుధవారం మైనారిటీ గురుకులాల సెక్రటరీ బి.షఫీఉల్లా ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉపాధ్యాయుడు విచక్షణ కోల్పోయి ఇష్టానుసారంగా కొట్టడంతో ఇదే కళాశాలలో పదవ తరగతి చదువుతున్న పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని ఒక తండాకు చెందిన బదావత్ సంజయ్ అనే విద్యార్థి చేయి విరగడంతో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్లో విద్యార్థి సంజయ్ తండ్రితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే రోజు ఉపాధ్యాయుడు వొల్లాల శ్రీనివాస్ ముగ్గురు విద్యార్థులను కొట్టగా అందులో ఇద్దరు బీసీ విద్యార్థులు ఉండగా ఒకరు ఎస్టీ విద్యార్థి కావాలని ఎస్సీ అనే సాకుతో నన్ను ఎక్కువగా వేధించి వొల్లాల శ్రీనివాస అనే ఉపాధ్యాయుడు కొట్టాడని పోలీసులకు లిఖితపూర్వకంగా విద్యార్థి సంజయ్ అతని తండ్రి ఫిర్యాదు చేయగా వొల్లాల శ్రీనివాస్ పై ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కరీంనగర్ రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేశారు. నేను యుటీఎఫ్ టేమ్రీస్ విభాగానికి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడి నని విర్రవీగుతూ,తోటి ఉపాధ్యాయుల తో గొడవలు పడటం, సిబ్బందితో వాగ్వివాదానికి దిగటం అలవాటుగా మారింది. ఉన్నత స్థానంలో ఉన్నాననే సోయి మరిచిపోయి ఒకరితో మరొకరికి తగులాటలు పెట్టించడం,నోటి దురుసు ను ప్రయోగించడం,విద్యార్థులను ఇష్టానుసారంగా కొట్టడం వంటి ఫిర్యాదులు సదరు ఉపాధ్యాయుడిపై విజిలెన్స్ విచారణ రిపోర్ట్ లో హెడ్ ఆఫీస్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం.దీనితో ఈ అంశాన్ని సీరి యస్‌గా తీసుకున్న మైనారిటీ గురుకు లాల సెక్రటరీ షఫీ ఉల్లా క్రమశిక్షణ చర్యల కింద ఉల్లాల శ్రీనివాసును సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

# మోడల్ స్కూల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవం

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 26 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లె మోడల్ స్కూల్ లో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపు కున్నారు.ఈ సందర్భంగా ప్రిన్స్ పాల్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ 1949 నవంబర్26న రాజ్యాంగ సభద్వారా రాజ్యాంగాన్నిభారత దేశంఆమోధించి ,1950జనవరి 26 న అమలులోకి తీసుకురావడం జరిగిందని, రాజ్యాంగ విలువలు తెలుసుకునేందుకు నవంబర్ 26 ను రాజ్యాంగ దినోత్సవం గా భారత దేశం ప్రకటించిందని తెలిపారు.



ఈ రోజున రాజ్యాంగ రూపకర్త బాబాసాహెబ్ అంబేద్క ర్ జీవిత విశేషాలు,రాజ్యాంగ విలువలగురించి తెలుకోవడం జరుగుతుందని తెలిపారు. రాజ్యాంగం పట్ల ప్రజలు స్వేచ్ఛ, సమానత్వంతో ప్రజాస్వామ్య పాలనలో ఎలా జీవన విధానం కొనసాగిస్తున్నారో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మన దేశ రాజ్యాంగం విలువలను సాంస్కృతిక ప్రదర్శల ద్వారా విద్యార్థులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

**చురకలు విలేకరి, గొల్లపల్లి, నవంబర్ 26 :** గొల్లపల్లి మండల కేంద్రంలోని బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కచ్చు కొమురయ్య రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సమాన హక్కులు కల్పించాలని రాజ్యాంగంలో పేర్కొన్నారని, అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర మధుసూదన్, రవీందర్, సత్యనారాయణ, ఆవుల సత్యం, తిరుపతి, సత్యం, శ్రీనివాస్, తిరుపతి, సంతోష్, రమేష్, వంశీకృష్ణ, అంజయ్య, లక్ష్మన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పరామర్శ



**చురకలు విలేకరి, రాయికల్, నవంబర్ 26 :** రాయికల్ పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను మాజీ మంత్రి జీవన్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. మృతి పట్ల వివరాలు అడిగి తెలుసుకుని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట రాయికల్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి,నాయకులు కొయ్యేడి మహిపాల్ రెడ్డి, బాపురపు నర్సయ్య,కొమ్ముల ఆది రెడ్డి,షాకీర్,అశోక్, గంగారెడ్డి, ఆనందం, శివ, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమరంకు మండల కాంగ్రెస్ సిద్ధం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట నవంబర్ 26 :** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ప్రవీణ్ టోనీ మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండలంలోని ప్రతి గ్రామంలోనీ పంచాయతీ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని,రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా పాలన అందిస్తున్న తరుణంలో ప్రతి సంక్షేమ పథకాన్ని అభివృద్ధి పలాలను ప్రజలకు వివరిస్తూ గత ప్రభుత్వం చేసిన దోపిడీని అహంకార పోరీత పాలనను ఎండగడుతూ గడపగడపకు ప్రచారం చేసి ప్రతి గ్రామపంచాయతీలో రిజర్వేషన్ల ప్రకారం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాజీ ప్రజా ప్రతినిధులు,ఇ0ద్రమ్మ కమిటీ సభ్యులు వివిధ విభాగాల అధ్యక్షులు కార్యదర్శులు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ఫోన్ అందజేత




**చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 26 :** వీణవంక మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన బండారి తిరుపతి గత సం..ఏప్రిల్ 30న సెల్ఫోన్ పోగొట్టుకోగా వీణవంక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా కానిస్టేబుల్ రఘుపతి సీఈ ఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి, సెల్ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.బుధవారం బాధితుడు బండారి తిరుపతి కి ఎస్సై ఆవుల తిరుపతి అందించారు.బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అన్నదాతకు ఆపద వస్తే ...అండగా ఉంటా..

**-తూకంలో జాప్యం ఎందుకు..?**
**-అధికారుల నిర్లక్ష్యంతోనే తూకంలో జాప్యం**
**-మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి**



**చురకలు విలేకరి, రాయికల్, నవంబర్ 26 :** ప్రతిపక్షంలో ఉన్న అధికారంలో ఉన్న అన్నదాతకు ఆపద వస్తే అండగా ఉంటానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు.బుధవారం రాయికల్ మండలంలో కట్కాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాల్లో గత వారం రోజులుగా తూకం నిలిచిపోయిం దన్న సమాచారం మేరకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గన్ని సంచుల కొరత,తూకం వేసిన ధాన్యం తరలిం చేందుకు కేటాయించిన రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలోని రైస్ మిల్లర్ అన్లోడింగ్ సమస్య ను రైతులు మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొనుగోలు కేంద్రంలోని సమస్యలను ఉన్నత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని తెలపడంతో 1500 గన్ని సంచులను కేంద్రానికి తరలించారు.అధికారుల పర్యవేక్షణ లోపంతోనే వారం రోజులుగా తూకంలో జాప్యం ఏర్పడిందని అధికారుల నిర్లక్ష్యం తో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంద న్నారు.జగిత్యాల జిల్లాలో రాయికల్ మండలంలోని మైతాపూర్ గ్రామ ఒక్క మిల్లు తోనే సమస్య ఎందుకు వస్తుందని అధికారులు పర్యవేక్షించి మిల్లర్లపై చర్యలు చేపట్టాలన్నారు. మిల్లర్ల సమస్య ఉంటే ప్రత్యామ్నాయంగా వేరే మిల్లును కేటాయించాలని సూచించారు. ధాన్యం మ్యాచర్ చూసి మ్యాచర్ ఉన్న రైతుల ధాన్యాన్ని తూకం వేయాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కూతకొచ్చే సమయానికి అకాల వర్షాల తో రైతులు నష్టపోయారని తీరా ధాన్యం అమ్మేందుకు కొనుగోలు కేంద్రానికి దాన్యం తీసుకువస్తే తూకంలో జాప్యం తో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో తూకంలో జాప్యం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమం లో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# "ఎలక్ట్రిసిటీ సుధాకర్ సార్" ఇకలేరు



**-అనారోగ్యంతో మృతి చెందిన పెందోట సుధాకర్**
**-పలువురి సంతాపం**
**-నేడు హుజురాబాద్‌లో అంత్యక్రియలు**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 26 :** హుజురాబాద్ పట్టణానికి చెందిన విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగి పెందోట సుధాకర్ (77) బుధవారం సాయంత్రం కన్నుమూశారు. సుధాకర్ సార్ గా ఆయన స్థానికంగా సుపరిచితులు. విద్యుత్ శాఖలో సుమారు 35 ఏళ్ల పాటు ఆయన సుదీర్ఘ సేవలు అందించారు.లైన్ ఇన్స్పెక్టర్గా పనిచేశారు. అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్నారు. పిల్లలతో పెద్దలతో అందరితో స్నేహ పూర్వకంగా మెదిలేవారు.గత కొద్ది కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు.హనుమకొండ ఏకశిలా (మ్యాక్స్ కేర్) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు గుండెపోటు వచ్చింది.దీంతోపాటు ఊపిరితిత్తుల సమస్యతో ఆయన బాధపడుతున్నారు.సుధాకర్ సార్ మృతితో హుజూరాబాద్లో విషాదం నెలకొంది.ఆయనకు భార్య, కుమారుడు కృష్ణమోహన్ కాగా కుమార్తెలు జ్యోత్స్న జ్యోతి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.సుధాకర్ సార్ అల్లుడు శ్రీనివాస్ మిషన్ భగీరథలో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్నారు.సుధాకర్ సార్ అంత్యక్రియలు గురువారం హుజురా బాద్‌లో జరగనున్నాయి.ఆయన మృతికి పలువురు విద్యుత్ శాఖ ఉద్యోగులు, విద్యుత్ ఉద్యోగులు సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. పలువురు మ్యాక్స్ కేర్ ఆస్పత్రిలో సుధాకర్ సర్ పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పురమ శ్రీకాంత్, బిజెపినేత అమ్మనగుర్తి వేణుగోపాల రావు,హుజురాబాద్ మాజీ ఉపసర్పంచ్ అయిత హరీష్, వ్యాపారవేత్త సిద్ది సురేందర్,రాంబాబు,చొల్లేటి గంగాధర్, గుత్తికొండ వెంకటరమణ తదితరులు నివాళులర్పించారు.మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయకుమార్,మాజీ జెడ్పిటిసి తోట రాజేంద్రప్రసాద్, దొనకొండ సత్యనారాయణ రెడ్డి, మేకల రాజిరెడ్డి, రమేష్ (కిరాణం) విద్యానగర్ వాసులు కాజీపేట కృష్ణ ప్రసాద్, ఎల్ఐసి సతీష్,పుల్లూరి లచ్చన్న,సబ్బని శివాజీ,కేసరి మధుకర్ రావు, కేసరి నగేష్,కోలే కళ్యాణ్ రావు,పాత్రికేయుడు ధర్మారెడ్డి,రచయిత రావుల పుల్లాచారి, పాత్రికేయులు ఆవునూరి సమ్మయ్య, తూముల వెంకటరెడ్డి,బెదరకోట శ్రీనివాస్,సబ్బని రవీందర్,జానీ (ఇల్లందుల శ్రీనివాస్) నాగార్జున స్కూల్ ముచ్చ నారాయణరెడ్డి,మంచికట్ల భాస్కర్,మంచి కట్ల అరుణ్,పలకల శ్రీనివాసరెడ్డి, ధర్మరాజు పల్లి లక్ష్మారెడ్డి, గంజి జయవర్ధన్, గొట్టిముక్కుల సంపత్ రావు, కవి తాళ్ల సత్యనారాయణ, జగన్మోహన్ రెడ్డి, పొన్నోజు సంతోష్ కుమార్, ఆడెపు సత్యం, మొకిల రాజేందర్, కాజీపేట కృష్ణ ప్రసాద్, మురికి శివ దయాళ్, చొల్లేటి శ్రీవాత్సవ, నరేడ్ల రాజు, క్యాస ఉపేందర్, కేసరి నగేష్, సుధీర్ నాయుడు, ముజామిల్ అహ్మద్ శంషి, పానుగంటి సత్యనారాయణ, కొమరవెల్లి రాధా స్వామి, ఎర్రం నారాయణరెడ్డి, వేణుముద్దల వెంకటరామిరెడ్డి, వేముగంటి ప్రవీణ్ కుమార్, పొన్నగంటి శ్రవణ్ తదితరులు సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

# మత్స్య గిరీంద్రుని ఆలయంలో..రాజగోపుర సింహద్వారా ప్రతిష్ట

**-హాజరైన పాలక మండలి చైర్మన్, ధర్మకర్తలు, దాతలు**
**-ఆలయ అర్చకుల వేదపఠనం మధ్య రాజగోపుర నిర్మాణానికి భూమిపూజ**



**కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్ :** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని గుట్టపై ప్రసిద్ధి చెందిన అత్యంత పురాతనమైన శ్రీ మత్స్య గిరీంద్ర స్వామి దేవాలయంలో ప్రతిపాదించిన రాజగోపురం నిర్మాణంలో భాగంగా బుధవారం సింహద్వార ప్రతిష్ట కార్యక్రమం జరిగింది.ఆలయ అర్చకులు శేషం మురళీధరాచార్యులు, శేషం మాధవాచార్యుల వేద పఠనం మధ్య భూమిపూజ కార్యక్రమం భక్తి శ్రద్దలతో నిర్వహించారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న ఆలయ పాలకమండలి చైర్మన్ కోరెం రాజిరెడ్డి మాట్లాడుతూ.. సుమారు రూ. 63 లక్షల వ్యయంతో రాజగోపురం నిర్మిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం భక్తులు, దాతలు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఏకైక మూర్తి ఆలయం మత్స్య గిరీంద్రుని ఆలయమని, ఆలయం క్రమక్రమంగా ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల, దాతల సహకారంతో అభివృద్ధి చెందుతూ వస్తోందని అన్నారు. కొత్తగట్టు గుట్టపై ప్రకృతి రమణీయత మధ్య ఎంతో మంది భక్తుల విశ్వాసంగా మత్స్య గిరీంద్రుడు కొలువై ఉన్నాడని, ఎంతో ప్రాశస్త్యం, వైభవం ఆలయానికి ఉన్నాయని అన్నారు.వచ్చే మాఘమాసంలో జరిగే బ్రహ్మోత్సవాలు, స్వామివారి కల్యాణోత్సవం వరకు రాజగోపురం నిర్మాణం పూర్తయ్యేందుకు కృషి చేస్తామని, భక్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు మొకిరాల లక్ష్మణ్ రావు, తాడిచర్ల తిరుపతి, ఎడ్ల తిరుపతి, రామగిరి సంపత్, కె రత్నం, దాతలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటినుండి నామినేషన్ పక్రియ

**-మొదటి విడతలో ఎన్నికలో ఇబ్రహింపట్నం మండలంలో 5 క్లస్టర్ లు 17 గ్రామాలు సర్పంచ్‌లు**
**-17,31383 మంది ఓటర్లు వార్డులు 162, పోలింగ్ బూతులు - 162**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం నవంబర్ (26) :** తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. 3 విడతల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసేలా ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది.డిసెంబరు 11,14,17 తేదీల్లో పోలింగ్ నిర్వహించటంతో పాటు ఆయా రోజుల్లోనే ఫలితాలను కూడా ప్రకటిస్తారు.జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం మెదటి విడతలో ఎన్నికలను నిర్వహించ నున్నారు.ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం అదేశాలు,జిల్లా ఉన్నత అదికారుల అదేశాల ప్రకారం మండలం లోని క్లస్టర్ లా వారిగా ఎన్నికల నామినేషన్ పక్రియ కోసం ఎర్పాట్లను అదికారులు చేశారు. బుధవారం నిమినేషన్‌ల పత్రలను సంబదిత క్లస్టర్ అదికారులకు ఎన్నికల నియావళి,నామినేషన్ పత్రలను మండల పరిషత్ కార్యల యంలో ఎన్నికల విదులలో పాల్గొనే అదికారులకు అందచేశారు.ప్రకియను ఇబ్రహింపట్నం మండల ఎంపిడిఓ గణేష్ ఎప్పుడు పరిశిలిస్తున్నారు.

**ఇబ్రహీంపట్నం మండలం లో రిజర్వేషన్లు...**

**ఇబ్రహీంపట్నం మండలం లో గ్రామలు 17**

అమ్మకపేట్ జనరల్,బర్దిపుర్ జనరల్ మహిళ,డబ్బ బిసి జనరల్, ఎర్దండి బిసి మహిళ,ఎర్రాపుర్ ఎస్సీ మహిళ,ఫకిర్ కోండపుర్ ఎస్టి,గోదుర్ బిసి జనరల్, ఇబ్రహింపట్నం జనరల్, కేశాపుర్ జనరల్ మహిళల,కోజన్ కోత్తుర్ బిసి మహిళ, కోమటికోండా పుర్ జనరల్ మహిళ,ములరాంపుర్ జనరల్ మహిళ,తిమ్మపుర్ బిసి జన రల్,తిమ్మపుర్ తండ ఎస్టి మహిళ, వర్షకోండ జనరల్ ,వేముల కుర్తి ఎస్సి జనరల్,యామపుర్ జనరల్‌గా రిజర్వేషన్లు కరారు అయ్యాయి.

**ఇబ్రహింపట్నం మండలం లో ఓటర్లు,బుతుల వివరాలు...**

ఇబ్రహింపట్నం మండలం లోని 17 గ్రామలలో 31383 మంది ఓటర్లు ఉన్నారు.స్త్రీలు-16818, పురుషులు-14565 కాగ ఇబ్రహీం పట్నం మండలం లో వార్డులు 162,గ్రామ సర్పంచ్‌లకు పోలింగ్ బుతులు - 162లు ఎర్పాటు చేశారు.

**నామినేషన్‌ల కోసం క్లస్టర్‌ల ఏర్పాటు...**

వేములకుర్తి క్లస్టర్‌లో ములరాంపుర్,బర్దిపుర్,ఎర్దండి , వేములకుర్తి గ్రామలు ,తిమ్మపుర్ క్లస్టర్ లో గోదుర్, తిమ్మపుర్, తిమ్మపుర్ తండ,యామపుర్, ఫకిర్ కోండపుర్ గ్రామలు,ఇబ్రహింపట్నం క్లస్టర్ లో ఇబ్రహింపట్నం తోపాటు,ఐకెపి కార్యలయంలో కేశాపుర్,కోజన్ కోత్తుర్,అమ్మకపెట్ గ్రామాలు, వర్షకోండ క్లస్టర్‌లో కోమటికోండా పుర్,డబ్బ,ఎర్రాపుర్,వర్షకోండ గ్రామాలు సదరు గ్రామలకు సంబదిత వ్యక్తులు రిజర్వేషన్ల అదారంగా నామినేషన్ వేసెందుకు అన్ని సౌకర్యలు ఎర్పాటు చేశారు.

**నేటినుంచి నామినేషన్లు...**

మొదటి విడత సర్పంచ్ ఎన్ని కలకు నవంబర్ 27 నుంచి నామినే షన్లను స్వీకరిస్తారు.సర్పంచ్,వార్డు సభ్యులు వారి నామినేషన్లను సమర్పిం చవచ్చు.నవంబర్ 29వ తేదీ వరకు వీటిని స్వీకరిస్తారు.నవంబర్ 30వ తేదీ నామినేషన్ పత్రాలను పరిశీలి స్తారు.వీటిపై డిసెంబరు 1న వినతుల ను స్వీకరిస్తారు. డిసెంబర్ 2వ తేదీన ఆయా దరఖాస్తులను పరిష్కరిస్తారు. డిసెంబర్ 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.అదే రోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.మొదటి విడత సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 11వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు.ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1వరకు పోలింగ్ ఉంటుంది.ఇక అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపడుతారు.ఫలితాల వెల్లడితో పాటు ఉప సర్పంచి ఎన్నిక ను సైతం నిర్వహిస్తారు. సాయంత్రం వరకు తుది ఫలితాలను ప్రకటిస్తారు.

**అమల్లోకి ఎన్నికల కోడ్...**

సర్పంచ్ ఎన్నికలకు షెడ్యూల్ రావటంతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. పోలీసులు, అబ్కారీ శాఖ వాళ్లు ఎక్కడి కక్కడ తనిఖీలు చేపట్టనున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఒక వ్యక్తి రూ.50 వేల నగదు మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుంది. అంతకన్నా ఎక్కువ ఉండి సరైన పత్రాలు లేకపోతే వాటిని సీజ్ చేస్తారు.తక్కువ మొత్తంలో దొరికిన డబ్బును రెవెన్యూ అధికారుల వద్ద జమ చేస్తారు. అదే ఎక్కువగా ఉంటే ఎన్నికల అధికారులు, ఆదాయ పన్ను, జీఎస్టీ అధికారులకు సమాచారం అందించి ఆ డబ్బును కోర్టులో జమ చేస్తారు. అత్యవసర అవసరమైన, ముఖ్యమైన అవసరాలకు పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు సరైన ఆధారాలు దగ్గర ఉంచుకుని అధికారు లకు చూపాలి. తనిఖీల సమయంలో చూపలేకపోయినా. తర్వాత ఈ పత్రాలను సమర్పిస్తే జప్తు చేసిన డబ్బును తిరిగి ఇస్తారు.